క్లుప్తంగా

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఏఆర్ అడిషనల్ డీసీపీ రాంచందర్



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ

చిన్నకోడూరు(సిద్దిపేట): పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏఆర్ అడిషనల్ డీసీపీ రాంచందర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్ద కోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాయామం నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు ఎప్పుడు?

ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ మండలం రిమ్మన గూడలో పత్తి పంట చేలను సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సకాలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను తెరిచి ఇబ్బందులు రాకుండా చూశామని గుర్తు చేశారు. నేడు పరిస్థితి భిన్నంగా మారిందన్నారు. ఈ కేంద్రాలు తెరవకపోవడం వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.2000–1500 రైతులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు.కార్యక్రమంలో గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలు శ్రమదానం చేయండి

హుస్నాబాద్: పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి ప్రజలు తమ వంతుగా వారంలో రెండు గంటలు శ్రమదానం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. స్వచ్ఛ దివాలి శుభ దివాలిలో భాగంగా పట్టణంలోని నేతాజీ నగర్‌లోని ప్రకృతి వనంలో శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రకృతి వనంలో ఉన్న గడ్డిని తొలగించారు.

మర్యాదపూర్వక కలయిక



డీఎంహెచ్‌ఓకు మొక్కను అందజేస్తున్న జాకీర్ హుస్సేన్ తదితరులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్‌ను జిల్లా కార్యాలయంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ (హెచ్‌వన్) యూనియన్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎంహెచ్‌ఓను శాలువాతో సన్మానించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌లు పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తంగళ్లపల్లి గ్రామ శివారులో మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా 2 ట్రాక్టర్‌లు అక్రమంగా ఇసుకను తీసుకు వెళ్తున్నారని అందిన సమాచారం మేరకు కోహెడ పోలీసులు వాటిని పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు చొప్పరి లింగం, రాయవేని కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ అభిలాశ్ పేర్కొన్నారు.

నేడు సిద్దిపేటకు మందకృష్ణ మాదిగ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అధినేత మందకృష్ణ మాదిగ ఆదివారం సిద్దిపేటకు రాబోతున్నారని ఎంఆర్‌పీఎస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో సాయంత్రం జరిగే మాదిగ అనుబంధ సంఘాల సమావేశానికి హాజరవుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వర్గీకరణకు అనుకూలంగా వచ్చిందన్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, ఎంఎంఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన పర్యటనను విజయవంతం చేయాలన్నారు.

బిస్కెట్ల మాటున గంజాయి!

- గుట్టుగా పల్లెలకు సరఫరా
- దృష్టి సారించని పోలీస్ యంత్రాంగం
- యువతే టార్గెట్‌గా దందా

అక్రమార్కులు రూటు మార్చి గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. బిస్కెట్లు, దుస్తుల అమ్మకాల మాటున నయా దందాకు తెరలేపారు. యువతే ప్రధాన లక్ష్యంగా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఈ ప్రక్రియ రాత్రిళ్లు పూర్తిస్థాయిలో కొనసాగుతోందని పలువురు పేర్కొంటున్నారు. మత్తుపదార్థాలు గ్రామాల్లో రాకుండా పోలీసులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



మర్కూక్(గజ్వేల్): వాహనాలలో గంజాయి పొట్లాలను తీసుకెళ్లి గ్రామాల్లో విక్రయిస్తే పోలీసులకు పట్టుబడుతామని భావించి బిస్కెట్లు, దుస్తుల విక్రయస్తులుగా అవతారం ఎత్తి దందాకు పాల్పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మత్తుకు అలవాటైన యువతను టార్గెట్ చేసుకొని విక్రయాలు జరుపుతున్నారు. హైదరాబాద్‌కు అతి సమీపంలో మర్కూక్ మండలం ఉండటంతో అక్కడి నుంచి కొంతమంది ద్విచక్ర వాహనాలలో బిస్కెట్లు, దుస్తులు అమ్మడానికి వచ్చి గంజాయి పొట్లాలను సరఫరా చేస్తున్నారు. ప్రధాన పట్టణాలైన గజ్వేల్, ములుగు, జగదేవ్‌పూర్, వర్గల్‌తో పాటు సిద్దిపేట జిల్లాలోని పలు మండలాలకు లక్ష్యం చేసుకొని నమ్మకస్తులతో వ్యాపారం జరుపుతున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లోనే అమ్ముతున్నట్లు తెలిసింది. గతంలో దామరకుంట, మర్కూక్, పాములపర్తి, ఎర్రవల్లి గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించి యువతను పట్టుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో మత్తుపదార్థాన్ని నియంత్రించలేదని అంటున్నారు. ఈ క్రమంలో గంజాయి కొనేందుకు తమ తల్లిదండ్రులతో పలువురు యువకులు గొడవపడుతున్నారు. చేతికి అందిన కాడికి తీసుకుని కొనుగోలు చేసి దమ్ముకొడుతున్నారు. దీంతో అక్రమార్కులకు మాత్రం ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా ఉంది. కానీ యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా గంజాయిని గ్రామాల్లోకి రాకుండా పోలీసులు అడ్డకట్ట వేయాలని, లేనిపక్షంలో యువత చెడుదారిలో పయనిస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **నిఘా పెట్టాం**
>
> 
>
> గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. నిఘా పెట్టాం. దాన్ని విక్రయిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మత్తు పదార్థాల నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా తాగుతున్నా మా దృష్టికి తేవాలి.
>
> – ఎస్ఐ దామోదర్

ఈపీఎఫ్ తరలిస్తే ఉద్యమమే..

బీఆర్ఎస్ ట్రేడ్ సెల్ హెచ్చరిక



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు

సిద్దిపేటజోన్: వేలాది కార్మికుల ప్రయోజనం కోసం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఈపీఎఫ్ కార్యాలయాన్ని కేంద్రం తరలించాలనే ఆలోచన విరమించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని బీఆర్ఎస్ కార్మిక విభాగం ప్రతినిధులు సాయిరాం, నర్సింహులు హెచ్చరించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒక్కొక్కటిగా సిద్దిపేట నుంచి కార్యాలయాలు తరలించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సిద్దిపేట ఈపీఎఫ్ ఆఫీసు తరలించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఇది ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. పీఎఫ్ ఆఫీసును తరలిస్తే కార్మికులకు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. ఈ విషయమై మెదక్ ఎంపీ రఘునందన్ కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలతో ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

పోరాటాల ఫలితమే డైట్ చార్జీల పెంపు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

గజ్వేల్‌రూరల్: పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో డైట్ చార్జీలను పెంచిందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డీబీఎఫ్‌తో పాటు దళిత, బీసీ విద్యార్థి సంఘాల పోరాటం ఫలితంగా హాస్టళ్లు, గురుకులాలు, ఇతర విద్యాసంస్థల్లోని విద్యార్థులకు డైట్ చార్జీలను పెంచుతూ ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వీటిని 10 రోజుల్లో అమలులోకి తీసుకురావాలని ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటేశం, ఏగొండస్వామి, రాజు, కాశీం, వేణు, యాదగిరి, రవి, కిషన్, సత్యనారాయణ, మందస్వామి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసు

సిద్దిపేటకమాన్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అరుణచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం సిద్దిపేట నుంచి అరుణచలానికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న సిద్దిపేట నుంచి హైదరాబాద్ మీదుగా 14న కాణిపాకం విఘ్నేశ్వర స్వామి దర్శనం, 15న అరుణచలం గిరిప్రదక్షిణ ఉంటుందని తెలిపారు. అనంతరం 16న జోగులాంబ అమ్మవారి దర్శనం తర్వాత అదే రోజు రాత్రి సిద్దిపేటకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని, ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్తీ డీజిల్ విక్రయించారని ఆందోళన



కల్తీ డీజిల్‌ను చూపిస్తున్న రైతు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కిషన్‌నగర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద కల్తీ డీజిల్ అమ్మారని తోటపల్లి రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతు తన పొలం దున్నడం కోసం శుక్రవారం రాత్రి డీజిల్ తీసుకెళ్లాడన్నారు. ట్రాక్టర్‌లో ఆయిల్ పోసి క్యాన్‌లో 2 లీటర్ల వరకు అట్టిపెట్టుకున్నాడన్నారు. శనివారం చూస్తే క్యాన్ అడుగున నీరు చేరి ఆయిల్‌పైకి రాగా రైతులతో కలిసివచ్చి అతను నిరసన తెలిపాడన్నారు. ఈ విషయమై బంక్ నిర్వాహకులను ప్రశ్నిస్తే డీజిల్ కల్తీ జరగలేదని సదరు రైతు నీరు పోసుకొని వచ్చారన్నారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం

షీటీమ్ సిబ్బందితో సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పిల్లలు, మహిళల రక్షణకు మేమున్నామని భరోసా కల్పించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో షీటీమ్ సిబ్బందితో వారు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై సీపీ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు షీటీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియపర్చాలన్నారు. హాట్ స్పాట్‌ల వద్ద, పాఠశాలల్లో మరిన్ని ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేసి నిఘా పెంచాలన్నారు. మహిళలు, పిల్లలను కావాలని ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. షీటీమ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. సంబంధిత ఏసీపీలు ఈ కార్యక్రమాలపై మానిటర్ చేయాలన్నారు. సోషల్ మీడియా వినియోగం పట్ల పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొమటిచెరువు, పాండవుల చెరువు, ఆక్సిజన్ పార్క్, రాజీవ్ పార్క్, అర్బన్ పార్క్, బస్టాండ్‌ల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. భరోసా సెంటర్ సిబ్బంది కూడా తరచుగా షీటీమ్ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, గజ్వేల్ డివిజన్‌ల షీటీమ్ సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదల పెన్నిధి



చెక్కు అందజేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సీఎం సహాయ నిధి నిరుపేదల పెన్నిధని కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం మహ్మద్ షాపూర్‌కు చెందిన అబ్బగోని ఆంజనేయులుకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 2.50 లక్షలు చెక్కును శనివారం తొగుటలోని తన స్వగృహంలో లబ్ధిదారుడికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతీఒక్కరు మెరుగైన వైద్యం చేయించుకోవడానికి సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చెరుకు విజయ్‌రెడ్డి (అమర్), బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి కనకయ్య, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు పడాల రాములు, ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, నాయకులు బండారు లాలు, రాజు, కొండల్‌రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

పోటీలను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జాన విజ్ఞాన వేదిక (జేవీవీ) తెలంగాణ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు తుమ్మ సత్యం అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఎంఈఓ మాధవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాయి 7న, మండల స్థాయి 21న, జిల్లాస్థాయి 28న రాష్ట్ర స్థాయి, 14 నుంచి మూడురోజుల పాటు ఆదిలాబాద్‌లోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురుకులాలు, పాఠశాలలు, ప్రైవేట్ విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బాల్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

తొగుట సీఐ లతీఫ్



అనాజీపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్

దుబ్బాకటౌన్: గ్రామాల్లో, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చని, నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం అనాజీపూర్ రేణుకా మాత ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాయపోల్ ఎస్సై రఘుపతి సీసీ కెమెరాల ప్రాధాన్యత, నేరాల నియంత్రణ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, తద్వారా అనాజీపూర్ గౌడ సంఘం సభ్యులు ముందుకు వచ్చి ఎల్లమ్మ దేవాలయంలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్సై రఘుపతి, అనాజీపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు హరికృష్ణ గౌడ్, సభ్యులు నర్సింహులు గౌడ్, యాదగిరి గౌడ్, బాల్ రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో విశేష పూజలు



మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం కార్తీకమాస ఆరంభాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష అర్చన, లలిత సహస్ర పారాయణం, దీపారాధన, మహామంగళహారతి, మంత్రపుష్పం మొదలగు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట):

జూడో పోటీలకు విద్యార్థులు ఎంపిక



కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు



గజ్వేల్‌రూరల్: విద్యార్థిని రేవతితో పీఈటీ జ్యోతి

కోహెడరూరల్(హుస్నాబాద్): జాతీయ స్థాయి జూడో పోటీలకు మండలంలోని నాగసముద్రాల.. మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబర్ 28 నుంచి 30 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 రాష్ట్రస్థాయి స్కూల్ బాలబాలికల జూడో పోటీలు వరంగల్ జిల్లాలోని పోచమ్మ మైదా కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ నుంచి 16 మంది క్రీడాకారులు పోటీల్లో వివిధ వెయిట్ కేటగిరిలో పాల్గొన్నారు. ఇందులో అత్యంత ప్రతిభ కనబర్చి సీహెచ్ సాహితి, టీ హరిక, బి అంజలి, బి.అపర్ణ, కావ్య, ఎం శ్రీచరణ్, కే పవన్, వినిల్ వివిధ కేటగిరిలో జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నర్సింహులు తెలిపారు. మండలంలోని వరికోలుకు చెందిన వినిల్ 100 వెయిట్ కేటగిరిలో బంగారు పతకం సాధించాడన్నారు. ఎంపికైన క్రీడాకారులు మన స్కూల్‌కు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రేవతి

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గజ్వేల్‌కు చెందిన కేజీబీవీకి చెందిన టెన్త్ విద్యార్థిని రేవతి ఎంపికై నట్లు ప్రత్యేకాధికారి అనురాధ, పీఈటీ జ్యోతి శనివారం తెలిపారు. ఇటీవల సిద్దిపేటలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్–17 విభాగంలో ఎంపికైందన్నారు. నవంబర్ 2 నుంచి 4 వరకు మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరపున విద్యార్థిని పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లోను ప్రతిభను చాటి ఈ ప్రాంతానికి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

ఎంపికలు...

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 4న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికల క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉదయం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదనంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గజ్వేల్‌రూరల్: అవినీతి రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దేశబోయిన నర్సింహులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నెహ్రూ యువకేంద్ర, సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావుతో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ నాణ్యమైన బోధన అందించండి

కొండపాక(గజ్వేల్): మెరుగైన బోధనలు అందేలా చూసుకోవాలని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు. కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి, కోలోనివంపు పాఠశాలలను శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యే పరామర్శ



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు బాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. పార్టీ పరంగా మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, పర్శరాములు తదితరులు ఉన్నారు.

◆ ఓటరుగా నమోదు చేసుకోవాలి

గజ్వేల్‌రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని గజ్వేల్ డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌వీఈఈపీపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియానా మాట్లాడారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, మంచి నాయకుడిని ఎన్నుకునే హక్కు ఓటుకే ఉందన్నారు.

◆ అద్దెకు ఆర్టీసీ బస్సులు

గజ్వేల్‌రూరల్: వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులను నడుపనున్నట్లు జీపీపీ (గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ శనివారం పేర్కొన్నారు. సంస్థ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. కార్తీకమాసం పురస్కరించుకొని విహారయాత్రలు, వివాహ శుభకార్యాలకు అద్దె ప్రాదిపదికన ఇస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు 99592-26270, 73863-67677, 99488-66980 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

◆ రోడ్డు పనుల ప్రారంభం



కొండపాక (గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో సీసీ రోడ్డు పనులను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి

చిన్నకోడూరు(సిద్దిపేట): జీవితంలో మనిషిని ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడేది చదువేనని ఎంఈఓ యాదవరెడ్డి అన్నారు. శనివారం వీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాముని‌పట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను కష్టంగా భావించకూడదన్నారు. ఇష్టంగా చదివితే అద్భుతాలు సృష్టిస్తారని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తారని వారికి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, సువర్ణాదేవి, ధర్మయ్య, నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.